క్లుప్తంగా

నాడు-నేడు పనుల పరిశీలన



భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ కూర్మనాథ్ పట్నాయక్

వేపాడ: మండలంలోని చినదుంగాడ ప్రాథమిక పాఠశాలలో నాడు-నేడులో భాగంగా చేపడుతున్న అభివృద్ధి పనులను ఎంపీడీఓ బి.సత్య కూర్మనాథ్ పట్నాయక్ గురువారం పరిశీలించారు. భవన, మరుగుదొడ్ల నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణా లు పాటించాలని, పనులను త్వరగా పూర్తి చేయించాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్‌కు సూచించారు. ఆయన వెంట ఎంఈఓ బాలభాస్కరరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

న్యాయవాదుల నిరసన



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

గజపతినగరం: విజయవాడ బార్ అసోసియేషన్ న్యాయవాది ఆర్.ఆదిశేషు విఠల్‌బాబు హత్యకు నిరసనగా స్థానిక సివిల్ కోర్టు న్యాయవాదులు గురువారం విధులను బహిష్కరించారు. న్యాయవాదులకు రక్షణ లేకుండా పోతోందని, దాడులు పెరుగుతున్నాయని స్థానిక న్యాయవాదులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం న్యాయవాదులకు ప్రత్యేక రక్షణ చట్టాన్ని తీసుకురావాలని కోరారు.

గిరిజన యూనివర్సిటీ రహదారికి స్థల పరిశీలన



స్థలం మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ శేష శైలజ

దత్తిరాజేరు: మండలంలోని మర్రివలస మెంటాడ మండలంలోని చినమేడపల్లి మధ్య 561.60 ఎకరాల్లో నిర్మించనున్న గిరిజన యూనివర్సిటీకి ప్రధాన రహదారి కోసం బొబ్బిలి ఆర్డీఓ శేషశైలజ గురువారం స్థలపరిశీలన చేశారు. కె.కొత్తవలస వద్ద జాతీయ రహదారి నుంచి యూనివర్సిటీకి 120 అడుగుల వెడల్పుతో రోడ్డు నిర్మాణానికి స్థలపరిశీలన చేస్తున్నట్లు ఆర్డీఓ తెలిపారు. వాగులు, వంకలు, గెడ్డలు లేని మార్గాన్ని పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారని చెప్పారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ గురుమూర్తి, డిప్యూటీ తహసీల్దార్ రమేష్, మండల సర్వేయర్ సత్యం ఉన్నారు.

పాముకాటుకు రైతు మృతి



రాముునాయుడు (ఫైల్ ఫొటో)

గజపతినగరం: మండలంలోని లింగాలవలస గ్రామానికి చెందిన రైతు మంత్రి రాముునాయుడు (55)పాముకాటుకు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. రాముునాయుడు గురువారం పొలం పనులు చేస్తున్న సమయంలో మరుగుదొడ్డి కోసం పక్కనే ఉన్న టేకు తోటలోకి వెళ్లాడు. అక్కడ విషసర్పం కాటేయడంతో పొలాల్లో ఉన్నవారంతా వచ్చి 108కు సమాచారం అందించారు. 108లో గజపతినగరం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళుతుండగా మార్గం మధ్యలో మృతి చెందారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఎస్‌ఐ గంగరాజు సమాచారం తెలుసుకుని కేసు నమోదు చేశారు.

హ్యాండ్ బాల్ పోటీలు



హ్యాండ్‌బాల్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

శృంగవరపుకోట: స్థానిక నవోదయ విద్యాలయంలో గురువారం నిర్వహించిన రీజనల్ హ్యాండ్‌బాల్ పోటీలను నవోదయ విద్యాలయ సంస్థ విశ్రాంత డిప్యూటీ కమిషనర్ నాగిరెడ్డి ఉమామహేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ దుర్గాప్రసాద్ నేతృత్వంలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ చదువుతో పాటూ మనోవికాసానికి, ఆత్మస్థైర్యానికి, ఆరోగ్యానికి, శారీరక ధారుఢ్యానికి క్రీడలు చాలా అవసరమన్నారు. నవోదయ విద్యాలయాల్లో చదవడం అదృష్టమన్నారు. నవోదయలో చదివిన 12 మంది విద్యార్థులు 2020లో ఐఏఎస్‌లుగా ఎంపికయ్యారన్నారు. రీజనల్ హ్యాండ్‌బాల్ పోటీల్లో ఆంధ్రా, తెలంగాణ, కేరళ, కర్నాటక, పాండిచ్చేరి, యానాం రాష్ట్రాల నుంచి 77 టీమ్‌లు నుంచి 424 మంది విద్యార్థులు హోరాహోరీగా పోటీపడ్డారు. విజేతలు సెప్టెంబర్ 9,10, 11 తేదీల్లో బీహార్‌లోని నలందలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపాల్ తెలిపారు.

‘జగనన్న సురక్ష’ విజయవంతం

- నెలరోజుల్లో గజపతినగరం నియోజకవర్గంలో 54,374, ఎస్.కోట నియోజకవర్గంలో 75,006 ధ్రువపత్రాల పంపిణీ
- అధికారులు, వలంటీర్లకు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యేలు అప్పలనరసయ్య, శ్రీనివాసరావు



గజపతినగరం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గజపతినగరం: నియోజకవర్గంలో ‘జగనన్న సురక్ష’ కార్యక్రమం విజయవంతం అయిందని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య తెలిపారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలే కరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నెలరోజుల పాటు నిర్వహించిన ‘జగనన్న సురక్ష’ కార్యక్రమానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించిందని చెప్పారు. కార్యక్రమం విజయవం తం కావడానికి కృషి చేసిన అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామవలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహించక ముందే గ్రామాల్లో వలంటీర్లు, గృహసారథులు, అధికారులు ఇంటింట సర్వే చేసి ప్రజలకు 11 రకాల ధ్రువపత్రాలు అందజేసేందుకు వివరాలు సేకరించి, ఆన్‌లైన్‌లో నమోదు చేశారని చెప్పారు. తర్వాత అధికారులు, ప్రజాప్రతినిధులు షెడ్యూల్ ప్రకారం గ్రామాల్లో క్యాంపులు నిర్వహించి ప్రజలకు ధ్రువపత్రాలు పంపిణీ చేశారని వివరించారు. నియోజకవర్గంలో 54,374 మందికి వివిధ ధ్రువపత్రాలు అందజేశామని పేర్కొన్నారు. 239 రైస్ కార్డులు మంజూరు చేశామని చెప్పారు. 25,029 మందికి ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, 24,999 కుల ధ్రువీకరణ పత్రాలు, 2,832 ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు, 2,832 మంది ఆధార్ కార్డులను అప్‌డేట్ చేశామని వివరించారు. ప్రజలకు ఇంకే మైనా సర్వీసులు కావాల్సి ఉంటే వాటిని అందించేందుకు, సమస్యలు ఉంటే పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. సాంకేతిక సమస్యల ద్వారా పథకాలు అందని వారు ఉంటే వాటిని సరిదిద్ది అర్హులం దరికీ పథకాలు అందించాలనే ఆలోచన ప్రభుత్వం చేస్తోందని వివరించారు. జెడ్పీటీసీ గార తవుడు, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు కరణం ఆదినారాయణ, మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు సామంతుల పైడిరాజు, మండల జేసీఎస్ కన్వీనర్ కనకల సుబ్రహ్మణ్యం, సీనియర్ నేతలు పి.నారాయణమూర్తి, బెల్లాన త్రినాథరావు, కర్రి రాముునాయుడు, కర్రి నానాజీ, ఆల్తి రాముునాయుడు పాల్గొన్నారు.



కొత్తవలస: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

ఏపీ దేశానికే రోల్‌మోడల్

కొత్తవలస: ప్రభుత్వ సేవలను ప్రజల ఇంటి ముంగిటకే అందించడంలో, సంక్షేమం, అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దేశానికే రోల్ మోడల్‌గా నిలుస్తోందని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని అర్ధన్నపాలెం గ్రామ సమీపంలోని తన క్యాంపు ఆఫీస్‌లో ఆయన వైఎస్సార్‌సీపీ శ్రేణుల తో కలిసి ఎమ్మెల్యే గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్.కోట నియోజకవర్గంలో ‘జగనన్న సురక్ష’ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అధికారులు,సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ప్రజాప్రతినిధులు, నాయ కులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. నియోజక వర్గంలో సుమారు 86వేల కుటుంబాలు ఉండగా.. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సుమారు 74 వేల కుటుంబా లను వలంటీర్లు, అధికారు లు కలిసి వారికి ఏయే ధ్రువపత్రాలు అవసరమో తెలుసుకున్నారని చెప్పారు. 76,308 మంది వివిధ ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకోగా 75,006 మందికి అధికారులు ధ్రువపత్రాలు అందజేశారని తెలిపారు. ధ్రువపత్రాలు లేక పథకాలకు దూరమైన వారి సమస్యలను పరిష్కరించి, సంక్షేమ పథకాలకు అవకాశం కల్పించామన్నా రు. అలాగే ‘గడప గడపకు మన ప్రభుత్వం’ కార్యక్రమంలో భాగంగా ప్రతీ గడపకు వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నామని, ఇప్పటివరకు 61 వేల గడపలకు వెళ్లామని చెప్పారు. ఎల్.కోట, కొత్తవలస,వేపాడ ఎంపీపీలు గేదెల శ్రీనివాసరావు, నీలంశెట్టి గోపెమ్మ, దొగ్గ సత్యవంతుడు, కొత్తవలస మార్కెటింగ్ కమిటీ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ మూకల కస్తూరి, బొంతల వెంకటరావు, కొత్తవలస పీఏసీఎస్ అధ్యక్షుడు గొరపల్లి శివ, వైఎస్సార్‌సీపీ రీజనల్ పంచాయతీరాజ్ కన్వీనర్ మెరపల సత్యనారాయణ, ఎల్.కోట జేసీఎస్ మండల ఇన్‌చార్జి యడ్ల కిశోర్‌కుమార్, వేపాడ మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు జగ్గబాబు, పార్టీ సీనియర్ నాయకులు ఎం.అప్పారావు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఉద్యానవన పంటల సాగుకు ప్రోత్సాహం

- మెగా ఆయిల్‌పామ్ ప్లాంటేషన్‌లో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు



చీపురుపల్లిరూరల్(గరివిడి): రైతులకు ఆయిల్ పామ్ మొక్కలు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, జేసీ మయూర అశోక్

చీపురుపల్లిరూరల్(గరివిడి): ఉద్యానవన పంటల సాగును ప్రభుత్వం ప్రోత్సాహిస్తోందని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ‘మెగా అయిల్‌పామ్ ప్లాంటేషన్’ కార్యక్రమంలో భాగంగా గరివిడి మండలంలోని కొండపాలెంలో రైతులకు జాయింట్ కలెక్టర్ మయూర అశోక్‌తో కలిసి ఆయిల్ పామ్ మొక్కలను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం ఉచితంగా మొక్కలు అందించడంతో పాటు సాగుకు, పంట మార్కెటింగ్‌కు ,అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తోందని చెప్పారు. ఆయిల్ పామ్ ప్లాంటేషన్‌లో దేశంలో మన రాష్ట్రమే ముందంజలో ఉందని చెప్పారు. జిల్లాను ఆరు జోన్‌లుగా విభజించి ‘మెగా ఆయిల్‌పామ్ ప్లాంటేషన్’కు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రభుత్వం టన్ను ఆయిల్‌పామ్ గెలల ధర రూ.12,493గా నిర్దేశించిందని చెప్పారు. కంపెనీలు ప్రతీ పదిహేను రోజులకు ఒకసారి పంటను కొనుగోలు చేసి, రైతుల ఖాతాల్లో డబ్బు లు జమ చేస్తారని తెలిపారు. ఆయిల్‌పామ్ సాగులో హార్టికల్చర్ అధికారులు లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. జేసీ మయూర అశోక్ మాట్లాడుతూ జిల్లాలో 19 మండలాల్లో 1,728 హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నట్లు తెలిపారు. మరో 7 మండలాల్లో ఈ పంటను సాగు చేసేందుకు ప్రతిపాదనలు చేశామని చెప్పారు. హార్టికల్చర్ డీడీ ఎ.వి.ఎస్.వి.జమదగ్ని, జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు, కొండపాలెం సర్పంచ్ పి.ప్రమీల, మాజీ ఎంపీపీ కొణిశ కృష్ణంనాయుడు, తహసీల్దార్ టి.గోవింద్, ఎంపీడీఓ జి.భాస్కరరావు, హార్టికల్చర్ ఏఓ చంద్రశేఖర్, ఏఓ సీహెచ్.రఘునాథ్, నాయకులు బమ్మిడి అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

రాయితీని సద్వినియోగం చేసుకోవాలి



కొత్తవలస: రైతులకు ఆయిల్ పామ్ మొక్కలు అందజేస్తున్న ఎమ్మెల్యే కడుబండి

కొత్తవలస: ఆయిల్ పామ్ పంటల సాగుకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగించుకోవాలని రైతులకు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని అర్ధన్నపాలెంలో జిల్లా ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో వేపాడ మండలానికి చెందిన పలువురు రైతులకు గురువారం పామాయిల్ మొక్కలను అందజేశారు. ఉద్యానవనశాఖ అధికారి పి.పద్మావతి మాట్లాడుతూ ఎస్.కోట నియోజకవర్గంలోని వేపాడ మండలంలో రైతులు ఆయిల్ పామ్ సాగు చేస్తున్నట్లు తెలిపారు. వందశాతం రాయితీతో మొక్కలను అందజేయడంతో పాటూ హెక్టార్‌కు సాగు ఖర్చుల నిమిత్తం ఏడాదికి రూ .29వేలు చప్పున నాలుగేళ్ల పాటు అందజేస్తామన్నారు. అంతరపంటల సాగు నిమిత్తం హెక్టార్‌కి ఏడాదికి రూ.5,250 చప్పున నాలుగేళ్లు అందజేస్తున్నట్లు వివరించారు. ఆయిల్ పామ్ మార్కెటింగ్ బాధ్యత కూడా ప్రభుత్వానిదేనని తెలిపారు. వేపాడ,ఎల్.కోట,కొత్తవలస ఎంపీపీలు, నాయకులు పాల్గొన్నారు.

రైస్ కార్డుల పంపిణీ



రైస్ కార్డులు అందజేస్తున్న జెడ్పీటీసీ శిరీష



రైస్ కార్డులు పంపిణీ చేస్తున్న వంశీకృష్ణ

చీపురుపల్లి: అర్హులందరికీ ప్రభుత్వం రైస్ కార్డులు మంజూరు చేస్తోందని జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష అన్నారు. చీపురుపల్లి సచివాలయం-5 పరిధిలో అయిదుగురికి కొత్తగా రైస్ కార్డులు మంజూరయ్యాయి. వీటిని లబ్ధిదారులకు పట్టణంలోని జెడ్పీటీసీ కార్యాలయంలో జెడ్పీటీసీ శిరీష, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ కార్యాలయంలో ఆయన తనయుడు వంశీకృష్ణ గురువారం వేర్వేరుగా పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి పాలనలో పేదలు సంక్షేమ పథకాల కోసం ఎదురు చూడాల్సిన అవసరం లేదన్నారు. అర్హత ఉండి దరఖాస్తు చేసుకుంటే తక్షణమే పథకాలు మంజూరవుతాయన్నారు. పథకాల కోసం రాజకీయ పైరవీలు అవసరం లేదని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, పతివాడ రాజారావు, కోరుకొండ దాలయ్య, అప్పికొండ ఆదిబాబు, మల్లెంపూడి శ్రీను, ముల్లు పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ

వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు టేక్ హోమ్ రేషన్ పంపిణీ కార్యక్రమం రెండోరోజు గురువారం పలుగ్రామాల్లో కొనసాగింది. గజపతినగరం మండలం పురిటిపెంటలో అంగన్‌వాడీ కేంద్రం-2, బొండపల్లి మండల కేంద్రలోని అంగన్‌వాడీ సెంటర్- 3లో గర్భిణులు, బాలింతలకు ఐసీడీఎస్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ చిన్మయి దేవి పౌష్టికాహార కిట్లను అందజేశారు. గుర్ల మండలంలోని పాలవలసలో ఎంపీపీ పొట్నూరు ప్రమీల, వేపాడ మండలంలోని చినగుడిపాలలో సర్పంచ్ బోజంకి రాముునాయుడు, నీలకంఠరాజపురంలో ఉపసర్పంచ్ కందిపల్లి పెదనాయుడు, చామలాపల్లిలో సర్పంచ్ కోలా సతీష్ పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఐసీడీఎస్ పీఓలు నాగమణి, ఉమాభారతి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

- గజపతినగరం, బొండపల్లి, గుర్ల, వేపాడ



గజపతినగరం: పురిటిపెంటలో పౌష్టికాహార కిట్లు పంపిణీ చేస్తున్న ఆర్జేడీ చిన్మయిదేవి



గుర్ల: పాలవలసలో పౌష్టికాహార కిట్లను అందజేస్తున్న ఎంపీపీ ప్రమీల



వేపాడ: చామలాపల్లిలో పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న సర్పంచ్ సతీష్



వేపాడ: చినగుడిపాలలో గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న సర్పంచ్ రాముునాయుడు

ఈ-క్రాప్ నమోదు శతశాతం పూర్తి చేయాలి



ఈ-క్రాప్ నమోదుపై వీఏఏను ఆరా తీస్తున్న జేసీ మయూర్ అశోక్

చీపురుపల్లిరూరల్(గరివిడి): ఈ-క్రాప్ నమోదును శతశాతం పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. గరివిడి మండలంలోని గెడ్డపువలస గ్రామంలో ఈ -క్రాప్‌లో నమోదైన పంటలను క్షేత్రస్థాయిలో గురువారం పరిశీలించారు. రైతులు సాగు చేస్తున్న ప్రతి పంటనూ పారదర్శకంగా ఈ-క్రాప్‌లో నమోదు చేయాలని సూచించారు. రైతు భరోసా కేంద్రాల్లో ఎరువుల నిల్వలు, ఈ-క్రాప్, భూరీసర్వే, విత్తనాల సరఫరా, నీటి వనరులు తదితర అంశాలపై వ్యవసాయ, రెవెన్యూ సిబ్బందిని ఆరా తీశారు. వెబ్‌లాండ్‌లో నమోదు కాని భూముల వివరాలను తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ టి.గోవింద్, ఏడీ కోటేశ్వరరావు, ఏఓ సీహెచ్.రఘునాథ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం



వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న జెడ్పీచైర్మన్ శ్రీనివాసరావు

మెరకముడిదాం: మండలంలోని గాతాడ గ్రామంలో ఆంధ్రా క్వార్ట్జ్ ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో ముదునూరి ఫౌండేషన్ యాజమాన్యం సౌజన్యంతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు గురువారం ప్రారంభించారు. ముదునూరి ఫౌండేషన్ యాజమాన్యాన్ని జెడ్పీ చైర్మన్ అభినందించారు. గ్రామంలో ప్రతీ కుటుంబానికి 40 లీటర్ల శుద్ధజలం రోజూ ఉచితంగా అందించనున్నట్లు చెప్పారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణ రాజు, ఎంపీపీ తాడ్డి కృష్ణవేణి, నాయకులు కోట్ల విశ్వేశ్వరరావు, కె.ఎస్.ఆర్.కె.ప్రసాద్, బూర్లె నరేష్‌కుమార్, స్థానిక సర్పంచ్ గిడిజాల భవానీశంకర్, నాయకుడు గిడిజాల సింహాచలం పాల్గొన్నారు.

‘ఫ్యామిలీ డాక్టర్’ను సద్వినియోగించుకోండి



అర్తమూరులో చిన్నారులకు సిరప్ వేస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

చీపురుపల్లిరూరల్(గరివిడి): ప్రజారోగ్యమే ధ్యేయంగా ప్రభుత్వం ‘ఫ్యామిలీ డాక్టర్’ కార్యక్రమం అమలు చేస్తోందని, ఈ సేవలను ప్రజలు సద్వినియోగించుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కరరావు సూచించారు. గరివిడి పట్టణంలో పీహెచ్‌సీని గురువారం ఆయన సందర్శించారు. అనంతరం కోనూరు పీహెచ్‌సీ పరిధి అర్తమూరు గ్రామంలో పర్యటించారు. గ్రామస్తులకు ‘ఫ్యామిలీ డాక్టర్’ కార్యక్రమం గురించి వివరించారు. నెలలో రెండుసార్లు గ్రామానికి వైద్యులు వచ్చి సేవలందిస్తారని చెప్పారు. గెడ్డపువలస గ్రామంలోని వెల్‌నెస్‌సెంటర్‌లో తనిఖీలు చేశారు. వైద్యసేవలపై స్థానికులను ఆరా తీశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు మందులు అందిస్తున్నదీ లేనిది సిబ్బందిని అడిగితెలుసుకున్నారు. ఆయనవెంట వైద్యాధికారులు, సిబ్బంది ఉన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

గజపతినగరం: జిల్లాలో విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో స్థానిక సాయి సిద్ధార్థ కళాశాల నుంచి నాలుగు రోడ్ల జంక్షన్ వరకు విద్యార్థులు గురువారం ర్యాలీ నిర్వహించారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.వెంకటేష్ మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా సంక్షేమ వసతి గృహాలకు మెస్ చార్జీలు చెల్లించాలని కోరారు. జాతీయ నూతన విద్యావిధానంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, జీఓ నంబర్-77ను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డి.రాము తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమంలో దేశానికే ఆదర్శం

- జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు



మెరకముడిదాం: మహిళకు పథకాలను వివరిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు



జామి: వృద్ధురాలికి పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యేలు అప్పలనరసయ్య, శ్రీనివాసరావు

మెరకముడిదాం: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గాతాడ గ్రామంలో గురువారం ‘గడపగడపకు మన ప్రభుత్వం’ కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, స్థానిక, మండ ల ప్రజాప్రతినిధులతో కలిసి ఇంటింటికీ వెళ్లి పథకాలు అందుతున్నాయా లేదా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ప్రజలను ఆరా తీశారు. పార్టీలకతీతంగా పథకాలు అందిస్తున్నామని చెప్పారు. స్థానిక సర్పంచ్ గిడిజాల భవానీశంకర్, ఎంపీపీ తాడ్డి కృష్ణవేణి, ఎంపీడీఓ ఎం.రత్నం, తహసీల్దార్ విజయభాస్కర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు, నాయకులు కోట్లవిశ్వేశ్వరరావు, కె.ఎస్.ఆర్.కె.ప్రసాద్, బూర్లె నరేష్‌కుమార్, గిడిజాలసింహాచలం పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ధ్యేయం

జామి: ప్రజాసంక్షేమమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని గజపతినగరం, ఎస్.కోట ఎమ్మెల్యేలు బొత్స అప్పలనరసయ్య, కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కుమరాం గ్రామంలో ఎమ్మెల్యే అప్పలనరసయ్య ఆధ్వర్యంలో గురువారం ‘గడప గడపకు మనప్రభుత్వం’ కార్యక్రమం నిర్వహించారు. అటుగా వెళుతున్న ఎమ్మెల్యే కడుబండి కూడా కార్యక్రమంలో పాల్గొని ఎమ్మెల్యే అప్పలనరసయ్యతో కలిసి ఇంటింటికీ వెళ్లి పథకాలను ప్రజలకు వివరించారు. ఏఎంసీ చైర్మన్ వేమల ముత్యాలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్, రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ చలుమూరి సత్యారావు, డీసీసీబీ డైరెక్టర్ పాండ్రంకి సంజీవి, స్థానిక సర్పంచ్ పిన్నింటి ఆదిలక్ష్మి, కంది పద్మావతి, నాయకులు తోట మధుసూదనరావు, ఎన్నింటి శేషు, పిన్నింటి రవికుమార్, కంది నర్సింగరావు,అప్పలరాజు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

ఆర్థిక సహాయం

చీపురుపల్లి: పట్టణంలోని వంగపల్లిపేట గ్రామానికి చెందిన ఆర్ఎంపీ శ్రీనివాస్‌కు ఇటీవల ప్రమాదంలో కాలువిరగడంతో శస్త్ర చికిత్స చేయించుకుని, ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయనకు జిల్లా ఆర్ఎంపీల సంఘం గురువారం రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేసింది. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఐ.గోపాలరావు, కార్యదర్శి శర్మ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

లక్కవరపుకోట: అరకు-విశాఖ జాతీయ రహదారిలో లక్కవరపుకోట-సంతపేట జంక్షన్‌ల మధ్య గురువారం ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో అరకుకు చెందిన దంపతులు తీవ్రగాయాల పాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాలు...అల్లూరి సీతారామరాజు జిల్లా అరకుకు చెందిన భార్యభర్తలు కడియం శ్రీనివాసరావు (50), కనకమహాలక్ష్మి(47) విశాఖపట్నం పని నిమిత్తం స్కూటీపై వెళ్లి తిరిగి వస్తున్నారు. ఎల్.కోట జంక్షన్ సమీపంలో వీరికి ఎదురుగా ఎల్.కోట గ్రామానికి చెందిన కోటిబాబు ద్విచక్రవాహనంపై వచ్చి ఢీకొట్టారు. శ్రీనివాసరావు,కనకమహాలక్ష్మి రోడ్డుపై తుళ్లిపడిపోవడంతో ఇద్దరి తలలకు తీవ్రగాయాలయ్యాయి. వీరిని స్థానికులు సమీపంలోని పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం విశాఖపట్నం కేజీహెచ్‌కి తరలించారు. అలాగే కోటిబాబుకు కూడా గాయాలు కావడంతో ఎస్.కోట ఏరియా ఆస్పత్రికి తరలించారు.ఎస్‌ఐ ఎస్.ముకుందరావు కేసు నమోదు చేశారు.

నేత్ర వైద్యశిబిరాలు

దత్తిరాజేరు: ‘వైఎస్సార్ కంటి వెలుగు’ కార్యక్రమంలో భాగంగా టి.భూర్జవలసలో ఆప్తాలమిక్ ఎల్.ఎల్.ఎస్.నాయుడు ఆధ్వర్యంలో గురువారం నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. 204 మందికి నేత్రపరీక్షలు చేసి 102 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేసినట్లు సర్పంచ్ మంత్రి క్రాంతికుమార్ తెలిపారు. అందరికీ ఉచితంగా శస్త్రచికిత్సలు చేసి మందులు అందజేస్తామని చెప్పారు.

50 మందికి కంటిపరీక్షలు..

జామి: ‘వైఎస్సార్‌కంటి వెలుగు’ కార్యక్రమంలో భాగంగా స్థానిక సచివాలయం-1లో గురువారం నేత్రవైద్యశిబిరం నిర్వహించారు. ఆప్తాలమిక్ అనుపమ 50 మంది వృద్ధులకు కంటి పరీక్షలు చేశారు.

నేడు ‘గడపగడపకు మన ప్రభుత్వం’

దత్తిరాజేరు: మండలంలోని ఆర్.రామచంద్రాపురంలో శుక్రవారం ఉదయం ‘గడప గడపకు మన ప్రభుత్వం’ కార్యక్రమం నిర్వహించను న్నట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం గురువారం తెలిపారు. ముందుగా గ్రామ సచివాలయ నూతన భవనాన్ని ఎమ్మెల్యే బొత్స అప్పలనరస య్య ప్రారంభిస్తారని, అనంతరం గ్రామంలో నిర్వహించే ‘గడప గడపకు మన ప్రభుత్వం’లో పాల్గొంటారని పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు, సంబంధిత సచివాలయ సిబ్బంది హాజరు కావాలని కోరారు.

అక్రమ కట్టడాల తొలగింపు

కొత్తవలస: మండలంలోని మంగళపాలెం గ్రామంలో ఇల్లెపుబాబు వీధిలో సీసీ రోడ్డుపైకి వై.రాము అనే వ్యక్తి ఇంటి మెట్లను నిర్మించారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు ఈ మెట్లను ఈఓపీఆర్డీ కె.ధర్మారావు, సచివాలయ సిబ్బంది పోలీసు బందోబస్తు మధ్య గురువారం తొలగించారు.

బాధ్యతతో విధులు నిర్వర్తించాలి

వేపాడ: గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు బాధ్యతతో విధులు నిర్వర్తించాలని ఎంపీడీఓ బి.ఎస్.ఎన్.కూర్మనాథ్ పట్నాయక్ సూచించారు. బానాది గ్రామ సచివాలయంలో సిబ్బంది, వలంటీర్లతో సర్పంచ్ కర్రి యశోద ఆధ్వర్యంలో గురువారం సమీక్ష నిర్వ హించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, పనితీరు మెరుగుపరుచుకోవాలని సూచించారు. ప్రజాసమస్యల పరిష్కారంలో అలసత్వం తగదని అన్నా రు. పంచాయతీ కార్యదర్శి ప్రభు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన

వేపాడ: సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంఈఓ- 2 బాలభాస్కరరావు గురువారం సందర్శించారు. నాడు-నేడులో భాగంగా నిర్మిస్తున్న మరుగుదొడ్ల ను, మధ్యాహ్నభోజన వంటకాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

బీసీలకు ప్రాధాన్యత ఇచ్చేది కాంగ్రెస్సే..

శృంగవరపుకోట: బీసీలకు తగిన ప్రాధాన్యం ఇచ్చేది కాంగ్రెస్ పార్టీ మాత్రమే అని డీసీసీ అధ్యక్షుడు శరగడం రమేష్‌కుమార్, ఆ పార్టీ మండల అధ్యక్షుడు గడి బంగారునాయుడు అన్నారు. స్థానిక సుబ్బరామిరెడ్డి కల్యాణ మండపంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో రమేష్‌కుమార్ మాట్లాడుతూ మూలబొడ్డవర పంచాయతీ భవానీనగర్‌కు చెందిన రాపేటి గోవర్ధన్‌కుమార్‌ను జిల్లా కాంగ్రెస్ ఓబీసీ సెక్రటరీగా నియమించినట్లు చెప్పారు. కాంగ్రెస్ పాలనలో పేద, మధ్యతరగతి వర్గాల వారు ఎంతో సుఖంగా బతికేవారని, దేశ సంపదను పెంచేలా, దళిత, పేద వర్గాలకు ప్రభుత్వం అండగా నిలిచేదన్నారు. నేడు బీజేపీ ప్రభుత్వం మత చాంధసవాదంతో పేట్రేగి పోతూ, కార్పొరేట్ శక్తుల కోసమే పనిచేస్తోందని విమర్శించారు.